

పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

వైద్యరంగంలో భద్రతాలోపాలను గుర్తించి పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులకు రక్షణ చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ యంత్రాగంతోపాటు స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా చాలా ముఖ్యం.

– సర్దార్‌వలి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, వజ్రకరూరు



వైద్యులకు భరోసా కల్పించాలి:

వైద్యులు భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉండకూడదు. వైద్యులపై దాడి చేయాలన్నా, అమానవీయంగా వ్యవహరించాలన్నా భయమేయాలి. కఠినమైన చట్టాలు చేస్తేనే వైద్యులు, వైద్యసిబ్బంది ప్రశాంతంగా పని చేయగలుగుతారు. ప్రభుత్వాలు స్పందించి మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కఠినమైన చట్టాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ అర్జున్, ఈఎన్‌టీ నిపుణులు, సీహెచ్‌సీ , ఉరవకొండ



పడకేసిన పారిశుధ్యం

- దోమల మందు పిచికారీ చేయలేదు.. దోమలపై దండయాత్రలేదు
- రక్తం జుర్రేస్తున్నాయ్
- జ్వరాల బారిన పడుతున్న జనం
- పట్టణంలో పత్తాలేని ఫాగింగ్
- కానరాని ఆయిల్ స్ప్రే
- బెంబేలెత్తుతున్న ప్రజలు



ఎమ్మెల్యే ఇంటి సమీపంలో ప్రధాన కాలువ దుస్థితి ఇలా..

పట్టణంలో డ్రెయినేజీల వ్యవస్థ నిర్వహణ వివరాలు..

పురపాలిక జనాభా	సుమారు 75 వేలు
మొత్తం వార్డులు	32
వార్డు సచివాలయాలు	18
పారిశుధ్య కార్మికులు	114
డ్రైనేజీల పొడువు	108 కిలోమీటర్లు
పక్కా కాల్వల పొడువు	108 కిలోమీటర్లు
కచ్చా డ్రెయిన్ల పొడువు	30 కిలోమీటర్లు
ఫాగింగ్ యంత్రాలు	03
ఏటా బ్లీచింగ్ పౌడర్	రూ.లక్ష
దోమల నివారణకు ఖర్చు	దాదాపు రూ.3 లక్షలు

రాయదుర్గం: పట్టణంలో డ్రెయినేజీల వ్యవస్థ నిత్యనెలలో భారీ వర్షాలు కురిశాయి. వాడలు, వంకలు, వీధులు, రోడ్లపైనా కూడా మురుగునీరు నిలిచి ఎటుచూసినా అపరిశుభ్రత నెలకొంది. దీంతో దోమల బెడద అధికమైంది. నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో కంప, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమలపై దండయాత్ర ప్రచారం ఆర్భాటానికే పరిమితమైంది. పట్టణంలోని వివిధ వార్డుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అధికారులు పత్తాలేరు.. ఫాగింగ్ అసలే చేయడంలేదు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని 32 వార్డులు, 75 వేల మంది జనాభా ఉన్నారు. 18 వార్డు సచివాలయాల్లోని 114 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా వార్డుల్లోని సీసీడ్రైన్లు, మీడియం డ్రైన్లు, అడుగు డ్రైనేజీలు 108 కిలోమీటర్లు ఉండగా, ఖచ్చా డ్రైనేజీలు 30 కిలో మీటర్లు ఉంటాయి. ఏడాదికి టన్ను బ్లీచింగ్ పౌడర్‌కు రూ.లక్ష, దోమల నిర్మూలనకు రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా నిధులు సమకూర్చలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల నిర్మూలనకు ఆయిల్ స్ప్రే, డ్రైనేజీల్లో వృథా ఆయిల్, స్ప్రే, బ్లీచింగ్ పౌడర్ చల్లడం పెద్దగా కనిపించలేదు. గంగమ్మబావి, పెద్ద డ్రైన్లు, మురుగు కాల్వల్లో వదల్లేకపోయారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ ఉంది. హెల్త్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ ఇచ్చారు.

జ్వరాలతో వణుకుతున్న జనం..

దగ్గు, ఫ్లూ జ్వరాలతో జనం వణికిపోతున్నారు. చాపకిందనీరులా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ విస్తరిస్తోంది. వాతావరణ పరిస్థితులతో పాటు పారిశుధ్య నిర్వహణ లోపం, దోమల దండయాత్ర వెరసి ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో క్రమంగా ఓపీ, ఐపీ పెరుగుతోంది. గత పది రోజుల కిత్రం 450 నుంచి 500 ఉండే ఓపీ ఒక్కసారిగా 600 నుంచి 700లు దాటుతోంది. ఇందులో గ్రామీణ ప్రజలు ఉంటున్నారు.

నివారణకు చర్యలు



పురపాలిక పరిధిలో దోమల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాం. ఇప్పటికే పలుమార్లు ఫాగింగ్, బ్లిచింగ్ పౌడర్ చల్లించాం. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల సంతతి పెంచుకుంది. కట్టడికి ప్రణాళికలు చేపట్టాం. డ్రైనేజీల్లోనూ పూడికతీయించాం. తద్వార నీరు ఎక్కడా నిల్వ చేరడం లేదు. ఈ సీజన్ ముగిసే వరకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఫాగింగ్, వృథా ఆయిల్ చల్లించి దోమల కట్టడికి కృషి చేస్తాం.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

నియంత్రణే నివారణకు మార్గం



నీరు నిల్వ లేకుండా ఇంటి పరిసరాలను, ఇంటి ఆవరణలో నీటి పాత్రలను, వారానికి ఒకసారి ఖాళీచేసి ఆరబెట్టాలి. చెత్తాచెదారం మురుగు కాల్వల్లో వేయరాదు. పాడుబడిన బావులు, నీటి మడుగుల్లో గంబూషియా చేపలను వదలాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. దోమలను పారద్రోలే పరికరాలను వినియోగించాలి. గత వారం నుంచి ఆస్పత్రిలో ఓపీ, ఐపీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇందులో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు.

– డాక్టర్ మాధవి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం



కొలిమి వీధిలో నివాస గృహాల మధ్య దోమల వృద్ధి కేంద్రంగా ఖాళీ స్థలం



పూడిక తీసిన మట్టి తరలించకపోవడంతో మళ్లీ కాలువలో పడుతున్న దృశ్యం



రామస్వామి వీధికి వెళ్లే దారిలో ప్రధాన డ్రైనేజీ దుస్థితి ఇలా..

క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి ఆసియా తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఆసియా 612 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి



75వీరాపురం వద్ద ఈ క్రాప్ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: ఈ క్రాప్ బుకింగ్‌ను పక్కగా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. మండలంలోని 75వీరాపురం గ్రామ సమీపంలో ఈ క్రాప్ బుకింగ్‌ను తహసీల్దార్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ,రెవెన్యూ శాఖసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కణేకల్లు: పంటకోత ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించాలని కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఎస్ఓ హేమవతి తెలిపారు. మంగళవారంస్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎంపీఈఓలు, వీలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. పంట కోత ఎలా చేయాలనే విషయాలపై అధికారులు వివరించారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని నిరసన

ఉరవకొండ: ఉరవకొండ, గడేకల్లు ఎస్సీ బాలుర వసతి గృహాల వార్డెన్ జగన్నాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం వద్ద జీవీఎస్ఎస్, ఆర్‌యూఎస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. జీవీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఆయ్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జ్ ఆఫీసు అధికారికి వినతి పత్రం అందించారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



లింగ వివక్షతపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు అజహర్‌ఖాన్

రాయదుర్గంటౌన్: ఆడపిల్లలను కాపాడుకుందాం..సృష్టించిన రక్షించుకుందామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అజహర్‌ఖాన్, ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్వచ్ఛ రాయదుర్గం స్వస్థ రాయదుర్గం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో లింగ వివక్ష, సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత కార్యక్రమాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: విద్యార్థినులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె కూడేరులోని కేజీబీవీని సందర్శించారు. వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. తాజా కూరగాయలు, ఆకులు కూరలతో మెనూ ప్రకారం వంట తయారు చేసి పిల్లలకు పెట్టాలని సూచించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఉమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్లు శివప్రసాద్, చంద్రకళ పాల్గొన్నా రు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి

కంబదూరు: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా?అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఎంఈఏ నూర్ మహమ్మద్, ఎడ్యుకేటర్ జ్యోతి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆదిచెన్నకేశవ స్వామి రథోత్సవం



కొనకొండ్లలో వెలసిన ఆదిచెన్న కేశవస్వామి మూలవిరాట్

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో వెలసిన ఆదిచెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి రథోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గు రువారం ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ధ్వజా రోహణం,అభిషేకం, నవగ్రహహోమం, అభిషేకం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేరోజు రాత్రి 8 గంటలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి,భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి కల్యాణోగత్సవం జరుగుతుందన్నారు. 30న స్వామికి అభిషేకం, 11 గంటలకు పల్లకీసేవ, మడుగుతేరు, సాయంత్రం 5 గంటలకు ఉట్ల ఉత్సవం, స్వామి రథోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ తెలిపారు. 31న స్వామికి అభిషేకం, పల్లకీసేవ, వసంతోత్సవం, రాత్రి 8గంటలకు భూదేవి, లక్ష్మమ్మదోపులు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

పూలకుంట యువకుడికి 'భారతసేవా రత్న'



అవార్డును అందుకుంటున్న యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు దివాకర్

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంటకు చెందిన యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు దివాకర్ భారత సేవా రత్నపురస్కార్ అవార్డు అందుకున్నాడు. ఆయన చేస్తున్న సేవలను మదర్ సర్వీస్ సొసైటీ వారు గుర్తించి భారతసేవా రత్న పురస్కార్ అవార్డును విజయవాడలో అందించారు. అవార్డు జ్ఞాపిక ప్రశంసాపత్రం అందించి సర్వీస్ టీం సభ్యులు ఘనంగా సత్కరించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలోని చిన్నారులతో సంచాలకురాలు వేదావతి



ఉట్టి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథరెడ్డి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో శ్రీకష్ణాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు మిన్నంటాయి. ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు. సాయంత్రం శ్రీవారి ప్రాకారోత్సవం, పల్లకీసేవ జరిగింది.

ఈశ్వరీ విశ్వఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కూడేరు: కూడేరులోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీ విశ్వ విద్యాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం మండల సంచాలకురాలు వేదావతి కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. చిన్నారులు దరించిన శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. ఆ చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం సభ్యులు కే శ్రీదేవి, నారాయణ రెడ్డి, శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విడపనకల్లు: మండలంలోని వి.కొత్తకోట గ్రామంలో మంగళవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. గ్రామంలో యాదవులంతా కూడా కృష్ణుడి చిత్రా పటాన్ని ఊరేగించారు. చిన్నారులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి.



పూజలందుకున్న సంతాన వేణుగోపాల స్వామి మూలవిరాట్

వజ్రకరూరు: కొనకొండ్లలోని శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, మంగళహారతి తదితర పూజలు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చాగంటి మల్లయ్య, చాగంటిలక్ష్మిదేవి దంపతుల అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగింపు చేశారు.



వి.కొత్తకోటలో చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారులు



కొనకొండ్లలో ఉట్టి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రావణ మంగళవారం .. భక్త పరవశం

రాయదుర్గం: నియోజకవర్గంలోని మురడి, నేమకల్లు గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన అంజన్న క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శ్రావణమాసంలో ఆఖరి మంగళవారం కావడంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలైన్లో నిలిచి దర్శనభాగ్యం పొందారు.

పవనసుతుడా..పాహిమాం

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం పవనసుతుడి నామస్మరణతో మార్మోగింది. శ్రావణ మాసం నాల్గో మంగళవారం వెన్న అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, గంగ జలాభిషేకం చేసి, వెన్న, పుష్పా మాలలు, తులసీమాలలతో స్వామిని అలంకరించారు.



అలంకరణలో మురడి ఆంజనేయస్వామి



పూజలందుకుంటున్న నేమకల్లు ఆంజనేయస్వామి

అనాథ శవానికి అంత్యక్రియలు

ఉరవకొండ: స్థానిక పార్కు ఆంజనేయస్వామి ఆలయం వద్ద కృష్ణయ్య (44) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అతని తరపు బంధువులు ఎవరూలేకపోవడంతో ఆపద్బాంధవ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆపద్బాంధవ ట్రస్టు, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టులు సంయుక్తంగా మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ సహకారంతో వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు తీసుకెళ్లి సంప్రదాయ బద్ధంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు మురళి, రాఘవేంద్ర ట్రస్టు అధ్యక్షులు నగ్రాకేశన్న, సభ్యులు నూర్‌బాషా, నవీన్, భీమేష్, అశోక్ పాల్గొన్నారు.



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

అధికార పార్టీ నాయకుల అత్యుత్సాహం

గుమ్మఘట్ట: అభివృద్ధి పనులను వారు చేయరు.. చేసేవారినీ చేయనివ్వరు అన్నట్లుంది.. అధికార పార్టీ నాయకుల తీరు. మండలంలోని కలుగోడులో అభివృద్ధి పనులను అడ్డదారుల్లో అడ్డుకున్నారు. వివరాలు.. కలుగోడు గ్రామం నుంచి రాయదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిలో జె.వెంకటంపల్లి గ్రామం వరకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కంపచెట్లు తొలగించి, రోడ్డుకుఇరువైపులా గరుసు మట్టి తోలించాలని గ్రామస్తులు, వాహనదారులు సర్పంచు కవిత దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ప్రజాభిప్రాయం మేరకు సర్పంచు జేసీబీ సాయంతో కంపచెట్లను తొలగించి, మట్టి తోలిస్తుండగా అధికార పార్టీనాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పోలీసులను ఉసిగొల్పి, వారి సహకారంతో మట్టి తోలుతున్న ట్రాక్టర్లను పట్టుకొని, స్టేషన్‌కు తరలించారు. కాగా ప్రజలకు ఉపయోగపడే పనులను చేస్తుంటే అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై రూరల్ సీఐ వెంకటరమణను అడగ్గా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ట్రాక్టర్లను పట్టుకొని, రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

వైభవంగా తోటప్పజ్జ స్వామి రథోత్సవం



తోటప్పజ్జస్వామి రథాన్ని లాగుతున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో తోటప్పజ్జ స్వామి

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డంలో వెలసిన తోటప్పజ్జ స్వామి రథోత్సవం మంగళవారం జరిగింది. ఉదయం నుంచి స్వామికి పవిత్ర గంగాజలంతో అభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రహోమం, ప్రత్యేకాలంకరణ, పుష్పాలంకరణ చేశారు. అనంతరం తోటప్పజ్జ రథోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా మారెమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో మారెమ్మదేవి

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన మారెమ్మ జాతర మంగళవారం కనుల పండువగా సాగింది. ఏటా శ్రావణమాసం ఆఖరి మంగళవారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలో అభిషేకం , కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

సంక్షిప్త సమాచారం

కేజీబీవీకి ఫ్యాన్లు వితరణ

విడపనకల్లు: మండలంలోని మాళాపురంలోని కేజీబీవీకి స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, భర్త వన్నూరుస్వామి, గ్రామపెద్దలు రాజాప్రసాదురావు మంగళవారం పది ఫ్యాన్లు వితరణ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ సూచించారు. మంగళవారం ఉరవకొండలోని పలు వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కూడేరు: ప్రత్యామ్నాయ విత్తన జొన్నలు, కొర్రలు, ఉలవల కోసం రైతులు బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. వర్షాభావంతో జులై నెలలో పంటలు సాగుచేయని రైతులకు సబ్సిడీ విత్తనాలిస్తామన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నివారం లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ, ఏఈఓ శైలజ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోకి వేదవతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టణ పోలీసులు మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నారు. బ్రహ్మసముద్రం మండలం కుర్లకుండకు చెందిన ఒక ట్రాక్టర్, దొడగట్ట గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్, బెలుగుప్ప మండలం సరపాపురానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని, స్టేషన్‌కు తీసుకెళ్లారు.

దోమకాటుతోనే ప్రాణాంతక వ్యాధులు

కణేకల్లు: దోమకాటుతోనే మలేరియా, డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులొస్తాయని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం యర్రగుంట గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఎంపీహెచ్‌ఈఓలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ తిరుపాల్‌నాయక్, హెల్త్ సూపర్ వైజర్ రత్నకుమారి పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

బెళుగుప్ప: రైతు సేవా కేంద్రాల్లో బిందు,తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం నక్కలపల్లిలో ఎంఐఏఓ మల్లేష్, జైన్ డ్రిప్ కంపెనీ డీసీఓ అవినాష్, స్కిప్పర్ డీసీఓ రాజు, నెటాఫిన్ డీలర్ మారుతీతో కలసి సబ్సిడీతో సూక్ష్మబిందు పరికరాలు అందించే విషయంపై అవగాహన కల్పించారు. వివరాలకు ఎంఐఏఓ సెల్: 7995010059లో సంప్రదించాలన్నారు

ఈ క్రాప్ నమోదు పరిశీలన

శెట్టూరు: మండంలోని అయ్యగార్లపల్లిలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును ఏడీఏ యల్లప్ప పరిశీలించారు. మంగళవారం అయ్యగార్లపల్లి రైతు సేవా కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైతులు, సేతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

6 గంటలకే పింఛన్ పంపిణీ చేయాలి

కూడేరు: సెప్టెంబర్ 1న ఉదయం 6 గంటలోపు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎంపీడీఓ విజయ లలిత ఆదేశించారు.మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల నగదు పంపిణీపై ఎంపీడీఓ విజయ లలిత పంచాయతీ కార్యదర్శులు, నగదు పంపిణీకి కేటాయించిన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏఓ విజయ కుమార్, ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.